## క్లుప్తంగా

### పర్యావరణ శాస్త్ర విభాగంలో జాతీయ సదస్సు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సామాజిక ఆర్థిక, పర్యావరణ ప్రగతికి అనుసరించాల్సిన వ్యూహాలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఫిబ్రవరి 21, 22 తేదీల్లో ఈసదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సదస్సు బ్రోచర్‌ను వీసీ కె.గంగాధరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కే రత్నషీలా మణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ రామచంద్రన్, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ త్రిమూర్తిరావు, సీడీసీ డీన్ వి.రవికుమార్, పర్యావరణ శాస్త్ర విభాగాధిపతి ఏవీవీఎస్. స్వామి, విభాగం అధ్యాపకులు వి.సుభాషిని, సిహెచ్ సునీత, కే.శశిధర్, సిహెచ్ ప్రసన్న, డాక్టర్ శాంతి, జేమ్స్ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ 33 కేవీ ఆర్టీసీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టీ–4 డీఈఈ పీహెచ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. వినోబా నగర్, మారుతీ నగర్, ఎల్బీనగర్, కమ్యూనిస్టు బొమ్మలు, చెన్నం వారి వీధి ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు. నల్లచెరువు పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని డీ–2 డీఈఈ బి.శ్రీనివాసరావు తెలిపారు. నల్లచెరువు, ఆర్.అగ్రహారం, డీఎస్ నగర్, చాకలిగుంట, సంగడిగుంట, లాంచస్టర్ రోడ్, ఉల్లిపాయల కోట్ల బజారు, పట్నంబజారు, లారీ స్టాండ్ ఏరియా, ఏటుకూరు రోడ్, ఎన్‌హెచ్–5 సర్వీస్ రోడ్ ప్రాంతాల్లోని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే డీ–13 సెక్షన్ పరిధిలోని నందివెలుగు రోడ్, మంగళదాస్ నగర్, సీతానగరం, ఆటోనగర్, మానస సరోవరం ఏరియాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

### కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి




నెహ్రూనగర్: రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు చనిపోతున్నా అధికారులు ఒక్క విచారణ కూడా చేపట్టకుండా మౌనంగా ఉంటున్నారని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో ఆర్ఎస్‌యూ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్య అందరి హక్కు అని కాని ఈ దేశంలో కార్పొరేట్ వ్యవస్థ వచ్చిన తరువాత విద్య ఒక విలువైన వస్తువుగా మారిందన్నారు. సంక్షేమ హాస్టల్స్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు విద్య దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు.

### సర్వీస్ ప్రొవైడర్స్ మేళా

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో చేతి వృత్తిదారులైన ఎలక్ట్రీషన్లు, బ్యూటీషన్లు, ప్లంబర్స్, కార్పెంటర్స్, రిఫ్రిజిరేటర్, ఏసీ మెకానిక్‌లు, టాపీ పని చేసేవారు...ఇతర చేతి వృత్తి దారులకు జీవనోపాధి కల్పించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సర్వీస్ ప్రొవైడర్స్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీ 1 శ్రీనివాసరావు హాజరై దరఖాస్తులు స్వీకరించారు.

### విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం విస్తృత తనిఖీలు


**రూ.10.56 లక్షల అపరాధ రుసుం వసూలు**

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో గుంటూరు–డీ10 సెక్షన్ పరిధిలో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 3,705 సర్వీసులు తనిఖీలు చేశారు. అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ముగ్గురికి రూ.0.98 లక్షలు, అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 188 మందికి రూ.9.58 లక్షలు కలిపి మొత్తం రూ.10.56 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదుల కోసం 9440812263, 9440812361 వాట్సప్ యాప్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. తనిఖీల్లో డీఈఈలు కె.రవికుమార్, ఎస్ఎం ప్రసాద్, షేక్ ముస్తాక్ అహమ్మద్, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఆపరేషన్ ఏఈలు ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, బి.దేవదాస్ పాల్గొన్నారు.

# వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్ నియంత్రణ..

- మహిళలు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి
- జీజీహెచ్‌లో ఆరు నెలల్లో 730 మంది బాధితులకు చికిత్స
- గర్భాశయ క్యాన్సర్ అవగాహన నెలగా జనవరి

గుంటూరు మెడికల్: క్యాన్సర్ సోకితే చనిపోతారనే భయం ప్రజల్లో ఇప్పటికి చాలా మందిలో ఉంది. కాని కొన్ని రకాల క్యాన్సర్‌లను రాకుండా ముందస్తుగానే వ్యాక్సిన్‌ల ద్వారా నివారించవచ్చు. అలాంటి వాటిల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఒకటి. వ్యాధిని ముందస్తుగానే గుర్తించడం ద్వారా ప్రాణాలు పోకుండా కాపాడవచ్చు. మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్న గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌పై అవగాహన కల్పించి వ్యాధి బారిన పడకుండా ప్రజలకు జాగ్రత్తలు వివరించేందుకు ప్రతి ఏడాది జనవరి నెలను గర్భాశయ క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.




గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పోస్టర్లు

#### వ్యాధి లక్షణాలు

గర్భాశయ క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించలేరు. రుతుక్రమ సమయంలో, లేదా లైంగిక సంభోగం తరువాత అసాధారణంగా యోని నుంచి రక్తస్రావం జరుగుతోంది. నడుము నొప్పి, కాళ్ళు నొప్పి, కాళ్లవాపు, అలసట, బరువు తగ్గుదల, ఆకలి తగ్గుట, చెడు వాసనతో కూడిన యోని స్రావాలు కారడం, యోనిలో గడ్డలు, శృంగార సమయంతో నొప్పి, యోనిలో అసౌకర్యం, యోని నుంచి మలం రావడం తదితర లక్షణాలు ఉంటాయి.

#### కారణాలు

మానవ పాపిల్లోమ వైరస్(హెచ్‌పీవీ) వైరస్ వల్ల ఈ వ్యాధి వస్తుంది. సంపర్కం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సంభవిస్తుంది. ఐదేళ్ల కన్న ఎక్కువ సమయం గర్భనిరోధక మాత్రలు వాడడం, తక్కువ వయస్సులోనే ముగ్గురికిపైగా పిల్లల్ని కనడం, ధూమపానం ప్రధానంగా చెప్పవచ్చు. వ్యాధి నిరోధక శక్తి తగ్గడం ద్వారా గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన పడతారు. భాగస్వామితో కాకుండా ఇతరులతో లైంగిక సంబంధాలు కలిగి ఉన్నవారికి ఇది సోకుతోంది.

#### రెగ్యులర్ చెకప్

వ్యాధి లక్షణాలు ప్రారంభంలో కనిపించవు. తొలి దశలోనే గుర్తిస్తే 95 శాతం పూర్తిగా నయం చేయవచ్చు. హై రిస్క్ గ్రూపునకు చెందిన మహిళలు ముందస్తుగా వ్యాధిపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. 30 నుంచి 49 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు కనీసం ఏడాది కొకసారైనా గైనకాలజిస్టులను సంప్రదించి రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

#### బాధితులు

గుంటూరు జీజీహెచ్‌లో 2024 జూలైలో 121 మంది, ఆగస్టులో 115 మంది, సెప్టెంబరు 149 మంది, అక్టోబరు 113 మంది, నవంబరులో 121 మంది, డిసెంబరులో 111 మంది, ఆరు నెలల వ్యవధిలో 730 మంది గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌తో చికిత్స పొందారు. జిల్లాలో పది మంది సర్జికల్ ఆంకాలజిస్టులు, 20 మంది మెడికల్ ఆంకాలజిస్టులు ఉన్నారు. వారంలో ఒక్కో వైద్యుని వద్దకు ఇరువురు వ్యాధి బాధితులు చికిత్స కోసం వెళుతున్నారు. వ్యాక్సిన్లు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

#### హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో చెక్



తొమ్మిది నుంచి 20 ఏళ్ల మధ్య వయస్సు వారు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ చేయించుకోవాలి. రెండు మోతాదుల్లో హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. టీకాలు చాలా సురక్షితమైనవి. గర్భ నిరోధక మాత్రలు దీర్ఘకాలం వాడకుండా జాగ్రత్త పడాలి. మహిళలకు వ్యాధిపై అవగాహన లేకపోవడం వల్ల ముఖ్యంగా టీకా అందుబాటులో ఉందనే విషయం తెలియక పలువురు వ్యాధి బారిన పడుతున్నారు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి,
క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

#### రెగ్యులర్ చెకప్ చేయించుకోవాలి



హైరిస్క్ గ్రూపునకు చెందిన మహిళలు ముందస్తుగా వ్యాధిపై అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలి. 30 ఏళ్ల నుండి 49 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు కనీసం ఏడాదికొకసారైనా గైనకాలజిస్టులను సంప్రదించి రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకుంటే ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. తొలి దశలోనే గుర్తిస్తే 95 శాతం క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయవచ్చు.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ, ప్రసూతి,
సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు

### గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా నాగూర్‌బాషా



గుంటూరు మెడికల్: జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ షేక్ నాగూర్‌బాషాను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నాగూర్‌బాషా అసోసియేట్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్ పొంది శుక్రవారం విధుల్లో చేరారు. ఎన్నారై వైద్య కళాశాలలో 2007లో ఎంబీబీఎస్, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ 2013లో జనరల్ మెడిసిన్‌లో పీజీ, ఆంధ్రా మెడికల్ కాలేజీలో 2016లో గ్యాస్ట్రో ఎంట్రాలజీలో సూపర్ స్పెషాలిటీ పీజీ వైద్య విద్యను నాగూర్‌బాషా అభ్యసించారు. గుంటూరు జీజీహెచ్‌లో 2020లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో కోత, కుట్లు లేని ల్యాప్రోస్కోపి ఆపరేషన్లు అధిక సంఖ్యలో చేసి అరుదైన రికార్డు నమోదు చేశారు. చిన్నారుల గొంతులో, కడుపులో ఇరుక్కుపోయిన సూదులు, తాళపు చెవులు, అయిస్కాంతపు ముక్కలు, బ్యాటరీలు, ఇతర వస్తువులను ల్యాప్రోస్కోపి ద్వారా బయటకు తీసి ఎంతో మంది చిన్నారుల ప్రాణాలను కాపాడారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది శుక్రవారం విధుల్లో చేరిన డాక్టర్ నాగూర్‌బాషాకు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ఎస్.వి. సుందరాచారీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

## ముక్కోటి సందడి



అరండల్‌పేట శ్రీమోహన రంగనాయకస్వామి దేవస్థానం వైకుంఠ ద్వారంలో స్వామివారు



క్యూలైన్‌లో భక్తులు





బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర దేవస్థానంలో వైకుంఠ ద్వారంలో స్వామివారు

## మాకు సంబంధంలేని కేసులకు భయపడేదిలేదు ..

- కాల్ చేసి చెబితే ఎప్పుడైనా విచారణకు రెడీ..
- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



ఓ పత్రిక క్లిప్‌నుచూపుతున్న అంబటి రాంబాబు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): అంబటి సోదరులపై క్రిమినల్ కేసు అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు చాలా ఉత్సాహంగా రాశాయని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అంబటి మాట్లాడుతూ టీవీ–5లో అంబటిపై కేసు అంటూ బ్రేకింగ్ వేశారని అన్నారు. అయితే పిల్లి బాబూరావు పెద్దగా పరిచయం లేదని అన్నారు. పిల్లి బాబూరావు ఫిర్యాదుతో నాపై ఎట్టకేలకు కేసు నమోదు చేయించారని చెప్పారు. అయితే దీనిపై ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. డీఎస్పీ, సీఐ ఎవరైనా విచారణకు ఏ క్షణమైనా రావాలని పిలిస్తే తప్పనిసరిగా వస్తానని చెప్పారు. ఈ కేసులో నిజం ఉందంటే అరెస్ట్ అయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. రెండున్నరేళ్లు మంత్రి పదవి, పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన నాపై కేసు నమోదు చేస్తే ముందస్తు బెయిల్ కూడా తీసుకోనని అన్నారు. సీఎం చంద్రబాబు, లోకేష్ చెప్పారని మా ఇంటి తలుపులు బాధవద్దని, ఒక్క కాల్ చేయండి బయటకు వస్తానని బదులిచ్చారు. మాకు సంబంధంలేని కేసు, భయపెట్టాలని చూస్తే పారిపోమని అన్నారు. ఒకవేళ నిజమైతే జైల్లో ఉండేందుకు సిద్ధమని అన్నారు. నేను ఒక సిటిజన్ అని, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఫాలోవర్ అని, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి శిష్యుడిగా ఉన్నానని తెలిపారు. అరెస్ట్ చేస్తే జైల్లో ఉండేందు కు సిద్ధమని చెప్పారు.

**అంబటిని కలిసిన గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి**

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ పదవి అనేది ప్రతి ఒక్కరిపై ఎంతో బాధ్యతను పెంచుతోందన్నారు. సుధీర్ భార్గవ్‌రెడ్డి భవిష్యత్తులో ఒక మంచి నేతగా ఎదగాలని ఆకాంక్షించారు.

## తెలుగు సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



మాట్లాడుతున్న డాక్టర్ షమా సుల్తానా...



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

గుంటూరు మెడికల్: తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలాగా ప్రపంచమంతా గౌరవించే తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా చేసే పెద్ద పండుగ సంక్రాంతి అని సలాం నమస్తే గుంటూరు వ్యవస్థాపకురాలు డాక్టర్ షమ సుల్తానా అన్నారు. స్థానిక రాజీవ్ గాంధీ నగర్ 6వలైన్ లో వెంకటేశ్వరరావు స్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ షమా సుల్తానా ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లికార్జునరావు, అనీల్ పాల్గొన్నారు.

**వీఎస్సార్ స్కూల్లో..**

గుంటూరు ఎడ్యుకేషన్: ఏటుకూరురోడ్డులోని వీఎస్సార్ హైస్కూల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల ఎదుట ముగ్గులు వేసి, భోగి మంట వేశారు. పాఠశాల డైరెక్టర్ వంగా శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వంగా రాజేశ్వరి పాల్గొన్నారు.

### సంక్రాంతి సంబరాల పోటీలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఈ నె 12 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు చేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారంలోగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

### రేపు ఉచిత వైద్యశిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12న 'రెటి నోపతి ఉచిత పరీక్ష – వైద్య సలహా శిబిరం – శాస్త్రీయ అవగాహన సభ' నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి 12గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## పాస్‌లున్నా... నో ఎంట్రీ

- నారెడ్కో ప్రాపర్టీ షోలో పోలీసులు అత్యుత్సాహం
- ప్రాపర్టీ షో లో స్టాల్స్ ఉన్నాయని చెప్పినా నో యూజ్




పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఎదురుచూస్తున్న స్టాల్స్ నిర్వాహకులు

నెహ్రూనగర్: నారెడ్కో ప్రాపర్టీ షో గుంటూరు నగరంలోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.. ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అయితే సదరు ప్రాపర్టీ షోలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. షోలో స్టాల్స్ ఏర్పాటు చేసుకున్న వారికి పాస్‌లు ఉన్నప్పటికీ వారిని లోపలికి అనుమతించకపోవడంతో వారు పోలీసులు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మా స్టాల్స్ ఉన్నాయి.. మేము లోపల లేకపోతే సమస్య వస్తుందని చెప్పినా అక్కడ విధుల్లో ఉన్న ఓ సీఐ, ఐజీ ఆదేశాల మేరకు పాసులు ఉన్నప్పటికీ లోపలికి అనుమతించేది లేదని చెప్పేసరికి చేసేదేమి లేక కొంత సేపు అక్కడే ఎండలో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

**నగరపాలక సంస్థ సిబ్బందికి భోజనాలు పెట్టని వైనం**

శుక్రవారం జరిగిన ప్రాపర్టీ షోకు సీఎం చంద్రబాబు వస్తున్నారనే సమాచారంతో గుంటూరు జిల్లా యంత్రాంగంతో పాటు, గుంటూరు నగరపాలక సంస్థ సిబ్బంది గత రెండు రోజులుగా అక్కడే విధులు నిర్వహిన్నారు. శుక్రవారం సీఎం వచ్చి వెళ్లిన అనంతరం అందరికి భోజనాలు ఏర్పాటు చేశారు. భోజనాల కోసం ప్రత్యేకంగా టోకెన్లు ఇచ్చారు. ఈ టోకెన్లు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగ సిబ్బందికి అందకపోవడంతో వారంతా తీవ్ర నిరాశ చెందారు. తెల్లవారుజాము నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా కనీసం మాకు భోజనాలు పెట్టారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

**భారీ స్థాయిలో విద్యార్థుల సమీకరణ**

ఈ ప్రాపర్టీ షోకు ప్రత్యేకంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులను భారీ స్థాయిలో సమీకరించి వలంటీర్లుగా సమకూర్చుకున్నారు. ఎక్కడ చూసిన మెడలో నారెడ్కో ప్రాపర్టీ షో ట్యాగ్‌లు వేసుకుని ప్రాంగణం అంతా తిరుగుతూ కనిపించారు. సగం విద్యార్థులే స్టాల్స్ వద్ద నిర్వహణ చూసుకోవాల్సి వచ్చింది.

## మధ్యంతర భృతి 27 శాతం విడుదల చేయండి



మట్లాడుతున్న చాంద్ బాషా

గుంటూరు మెడికల్: మధ్యంతర భృతి 27 శాతం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. చాంద్ భాష మాట్లాడుతూ 12 వేతన సవరణ కమిటీని తక్షణమే నియమించాలన్నారు. సమావేశంలో నగరశాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నగర శాఖ కార్యదర్శి సాంబశివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, రహిమాన్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, సుమిత్రా దేవి, అరుణ కుమారి, షబానా సుల్తానా, రోజా, కోట సాహెబ్, ప్రసాద్ పాల్గొన్నారు.

### శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణకు జీటీఎస్(గార్బేజ్ ట్రాన్స్ఫర్ సిస్టం)లు ఉపయోగపడతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఏటుకూరు రోడ్డులోని నగర పాలక సంస్థ కంపోస్ట్ యార్డులో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలసి రూ.6.60 కోట్లతో నిర్మించనున్న జీటీఎస్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో యస్.ఈ నాగామల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ పి.జె.అమృత, ఈఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ రవిబాబు పాల్గొన్నారు.

## నేడు అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు

పట్నంబజారు: అరుణాచలం పవిత్ర పుణ్యక్షేత్రంలో ఈనెల 13న పౌర్ణమి గిరిప్రదక్షిణ మహోత్సవాలకు సంబంధించి ప్రత్యేక బస్సు శనివారం రాత్రి 9.15 గంటలకు బస్సు బయల్దేరనుంది. ఈనెల 12వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకున్న అనంతరం అదే రోజు రాత్రి అక్కడి నుంచి బయల్దేరి అరుణాచలం చేరుకుంటుంది. భక్తులు గిరిప్రదక్షిణలు చేసుకుని, అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం అరుణాలచలంలో బయల్దేరి 14వ తేదీ ఉదయం 6 గంటలకు గుంటూరు చేరుకుంటుంది.

## భక్తి శ్రద్ధలతో నవగ్రహ రుద్రాభిషేకాలు



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం సాయంత్రం రుద్రాభిషేకాలు– విష్ణు, లలిత, ఆదిత్య హృదయ పారాయణాలు నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, టి.టి.డి. ఆళ్వార్ ప్రాజెక్ట్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కె.వి.శ్రీరంగనాయకి ఆధ్వర్యంలో నిర్వహించారు. ధార్మిక ప్రాంగణంలో లక్ష్మీగణపతి, నవగ్రహ రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, ఉపన్యాసభూషణ శ్రీమాన్ గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ స్వామి పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

లక్ష్మీపురం: పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ కరీముల్లాపై దాడి చేసిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి డిమాండ్ చేశారు. స్థానిక ఏటీ అగ్రహారంలోని సమితి కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. విధులలో భాగంగా యడ్లపాడు మండలం, కొత్తపాలెంలోని వక్ఫ్ బోర్డు భూముల పరిశీలనకు వెళ్లిన కరిముల్లాపై భూములను ఆక్రమించిన మాధవరావు తన అనుచరులతో దాడి చేసి కొట్టటమే కాకుండా పొలంలోకి వస్తే చంపుతామని బెదిరించటం దారుణమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి స్పందించి నిందితులకు శిక్షలు పడే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ యాసిన్ షాకీర్ ఉన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన




గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్‌బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వాడిపారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలపై యుద్ధాన్ని ప్రకటిస్తూ విద్యార్థులు నృత్య ప్రదర్శనతో సామాజిక స్పృహ కలిగించారు. కార్యక్రమంలో హిందూ కాలేజీ హైస్కూల్ కౌన్సిల్ కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు, న్యాయవాది కృష్ణ శ్రీనివాస్, పాఠశాల కార్యదర్శి పి. రామచంద్రరాజు, కోశాధికారి కె. రామ్ సుభాష్, ప్రిన్సిపాల్ ఎస్. హేమాంబ, హెచ్ఎం కృష్ణ ఉషశ్రీ పాల్గొన్నారు.